క్లుప్తంగా

వైఎస్సార్ పశు బీమాను వినియోగించుకోవాలి

ఫిరంగిపురం: డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని వినియోగించుకోవాలని ఫిరంగిపురం పశువైద్యాధికారి కోటిరత్నం రైతులకు సూచించారు. పశువైద్యశాలలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఒక ఏడాది పశువుకు బీమా చెల్లిస్తే మూడేళ్లు ఇది వర్తిస్తుందని చెప్పారు. సంకరజాతి పశువుకు రూ.30వేలు, దేశీయ జాతి పశువుకు రూ.15వేలు, మేకలు, గొర్రెలు ఒక్కోదానికి రూ.ఆరువేలు బీమా వర్తిస్తుందన్నారు. పాడి ఆవులు రెండు నుంచి పదేళ్ల వయస్సు ఉండాలని లేదా ఒక ఈత అయినా ఈని ఉండాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన రైతులు సంకరజాతి పశువులకు రూ.384, దేశీయజాతి పశువులకు రూ.480, ఇతర వర్గాల వారికి సంకరజాతికి రూ.960 చెల్లించి బీమా పొందాలని కోరారు. ఈ బీమా వలన పశువులు రోడ్డు, రైలు ప్రమాదం, రోగాలతో అనారోగ్యానికి గురికావడం, పాముకాటు, వరదలు, అగ్నిప్రమాదం వంటి ప్రమాదాలకు గురైన వాటికి ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. మండల రైతులు దీనిని వినియోగించుకోవాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

కానిస్టేబుల్ సహా ఆరుగురు అరెస్టు

ప్రత్తిపాడు: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి కానిస్టేబుల్ సహా ఆరుగురిని అరెస్టు చేసిన ఘటన నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానిక వైఎస్సార్ కాలనీలోని రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం శుక్రవారం ఎస్ఐకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో జూద స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొబైల్స్‌తో పాటు రూ. 25,300ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అయితే, దొరికిన వారిలో జిల్లా కేంద్రంలో ఓ పోలీస్ ఉన్నతాధికారి వద్ద విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటివి జరుగుతుంటే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ రవీంద్రబాబు కోరారు.

పేదలకు అన్నదానం



తెనాలి: స్థానిక బోసు రోడ్డులో స్వరాజ్ టాకీస్ సెంటరులోని సాయిబాబా ఆలయం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. వాసవి క్లబ్ తెనాలి టౌన్, ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్ గోనుగుంట్ల జయంత్ కుమార్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. చిన్నారి నమ్రత జన్మదిన సందర్భంగా ఈ సేవను నిర్వహించారు. మాడా వెంకట సుబ్బారావు, భాస్కరుని శివప్రసాద్, గొడవర్తి మల్లికార్జునరావు, తాడికొండ రఘునాథబాబు, మాజేటి శారద, పద్మజకుమారి, పరమేశ్వరి పాల్గొన్నారు.

రేపు ఎన్టీఆర్ ఆణిముత్యాలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఆణిముత్యాలు పేరున సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ్‌ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

వేమూరు: పాత గొడవల నేపథ్యంలో ఇరు కుటుంబాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో.. కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చోడయ్య తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. బలిజేపల్లి గ్రామంలో దొప్పలపూడి సుధాకర్, తోటకూర ప్రశాంతి కుటుంబాల మధ్య గొడవలు నెలకొన్నాయి. గత పదిహేను రోజుల క్రితం సుధాకర్ కుమారుడు, ప్రశాంతి మధ్య గొడవలు జరగడంతో..కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో గురువారం బలిజేపల్లి గ్రామంలో తోటకూర ప్రశాంతి ఇంటిలో శుభకార్యం జరుగుతున్న క్రమంలో..మరోసారి దొప్పలపూడి సుధాకర్ కుటుంబం, ప్రశాంతి కుటుంబం మధ్య గొడవలు చేలరేగాయి. దీంతో ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. గాయపడిన వారు తెనాలి ప్రభుత్వ వైద్య శాలలో చికిత్స పొందుతున్నారు. బలిజేపల్లి గ్రామం వెళ్లి, విచారించి ఇరువర్గాలపై కేసులు నమోదు చయడం జరిగిందని ఎస్ఐ చోడయ్య శుక్రవారం తెలిపారు.

మహిళపై దాడి.. వ్యక్తిపై కేసు నమోదు

బాపట్లటౌన్: మహిళపై దాడిచేసిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని హయ్యర్ నగర్‌కు చెందిన సలగల ఇందిరా.. దగ్గుమల్లి శేఖర్ అనే వ్యక్తి వద్ద రూ. 15 వేలు అప్పుగా తీసుకున్నారు. అప్పును విడతల వారీగా చెల్లిస్తున్నప్పటికీ గురువారం రాత్రి ఇంటికి వచ్చి శేఖర్ దౌర్జన్యం చేశాడని, తను, తన కుమారుడిపై దాడిచేశారంటూ ఇందిరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ రఫీ దగ్గుమల్లి శేఖర్‌పై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఊరూవాడా పండుగ

- పట్టాల పంపిణీకి భారీగా తరలిన మహిళలు
- బస్సుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నాయకులు, అధికారులు

మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. రాజధాని గ్రామాల్లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రామీణ రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. సొంత ఇంటి కల నెరవేరుతుందన్న సంతోషం వారి మోముల్లో తొణికిసలాడింది.



సభకు తరలివచ్చిన జనం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా శుక్రవారం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడంతో మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ నుంచి భారీగా ఆ సభకు వెళ్లారు. ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారులు ఆయా ప్రాంతాల్లో బయలుదేరారు. వారి కోసం ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. పట్టాల పంపిణీకి వెళుతున్న మహిళలు వారి వారి బస్సులను తోరణాలతో అందంగా అలంకరించుకున్నారు. పలు ప్రాంతాల్లో బస్సుల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని ఉంచి క్షీరాభిషేకం నిర్వహించారు. ఉండవల్లి వైఎస్సార్ సీపీ నాయకులు దంటు గోవర్ధన్‌రెడ్డి సభకు వెళ్లేవారికి మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను అందించారు. ఇప్పటం, గుండిమెడ ప్రాంతాల్లో తాడేపల్లి రూరల్ వైస్సార్ సీపీ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. వీరితోపాటు నగర పాలక సంస్థ అధికారులు బస్సుల్లో వెళ్లేవారికి అల్పాహారాన్ని అందజేసి, వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. వలంటీర్లు, యానిమేటర్లు, సచివాలయ సిబ్బంది దగ్గరుండి మరీ మహిళలను బస్సు ఎక్కించి సభా ప్రాంగణానికి పంపించారు. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు పలు రహదారులు సభకు వెళ్లే బస్సులతో కిటకిటలాడాయి. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ మహిళలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం ఆదేశాల మేరకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి

- ప్రతి ఒక్కరూ దానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలి
- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ నిర్వహించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటపాలెంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ అనంతరం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి, మంగళగిరి తహసీల్దార్లు నాగిరెడ్డి, రామ్‌ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సర్వేయర్లతో కలసి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నేటి నుంచే ప్రారంభించాలని సూచించారు. అధికారులందరూ సమయపాలన పాటించి లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని, ప్రతి సచివాలయంలో పరిధిలో లబ్ధిదారులను గుర్తించి వారికి ఒక గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఏ ఏ పనులు చేస్తున్నామో సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారి వెంకటరెడ్డి, ఏఈలు ప్రవీణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

అభివృద్ధి పనులపై విస్తృత పర్యటన

నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. తొలుత రత్నాల చెరువు మెయిన్ రోడ్ నుంచి నేషనల్ హైవే సర్వీస్ రోడ్ వరకు విస్తరించిన బీటీ రోడ్ నిర్మాణ పనులను అధికారులతో కలసి పరిశీలించారు. రత్నాల చెరువు వసంత అపార్ట్‌మెంట్ నుంచి అర్బన్ హెల్త్ సెంటర్ మీదుగా నేషనల్ హైవే వరకు రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మించే బీటీరోడ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణం చేసిన వెంటనే సైడ్ బర్న్ ఏర్పాటు చేయాలని, రోడ్డు ఆక్రమణలు వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వడ్డెరపాలెం నేషనల్ హైవేను ఆనుకుని ఆత్మకూరు సచివాలయం వరకు నూతనంగా నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను పరిశీలించి నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఏపీఎస్‌పీ క్యాంప్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ పనులను పరిశీలించి పనుల అనంతరం రెండువైపులా మొక్కలు నాటాలని ఆయన సూచించారు.

కొత్త పనులపై సమీక్ష

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగర పాలక సంస్థ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.125 కోట్ల నిధులు కేటాయించారు. ఇప్పటికే మంగళగిరి తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి పనులు పూర్తయిన కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులకు సూచించారు. జరగవలసిన పనులను వేగవంతం చేయాలని, కొత్త వాటికి టెండర్లు పిలిచి వర్షాకాలం లోపుగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. సమావేశంలో కమిషనర్ శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు, ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు, వికాసానికి క్రీడలు తోడ్పాటు

తెనాలి: క్రీడలు వ్యక్తిగత క్రమశిక్షణతోపాటు పరిపూర్ణ వికాసానికి తోడ్పడుతాయని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. కేబీఎస్ అండ్ కేవైఆర్ క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం ఆయన ఇక్కడి వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజ్ మైదానంలో ప్రారంభించారు. జూన్ 5వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథి ఆలపాటి రాజా మాట్లాడుతూ క్రీడలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా నేటిరోజుల్లో క్రికెట్‌కు అపూర్వ ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడు కోలా అశోక్, పట్టణ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్, ఈదర వెంకటపూర్ణ చంద్, మంగమూరి హరిప్రసాద్, అత్తోట శరత్, నలుకుర్తి ప్రభాకర్, శేషగిరిరావు, కొరివి శ్రీనివాసరావు, చెన్నూరి రామారావు, బత్తుల ప్రసాద్, యర్రంశెట్టి వేణు, చెన్నంశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఆలపాటి రాజా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

నెహ్రూనగర్: నూతన పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రారంభించాలనే ప్రధాన అంశంతో శనివారం అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో సామాజిక ప్రజాస్వామికవాదుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కన్వీనర్ వై. కోటేశ్వరరావు (వైకే) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థకు అధిపతి అయిన రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం సబబు కాదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి, ఉద్యోగ, ప్రజా, మహిళా సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌గా కోటేశ్వరరావు

నెహ్రూనగర్: గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి జూన్ 7వ తేదీ వరకు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లిన నేపథ్యంలో ఆమె స్థానంలో కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)గా విధులు నిర్వహిస్తున్న పి. కోటేశ్వరరావుకు దాంతో పాటు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏటుకూరు బైపాస్‌లోని ఆంధ్రా భోజనం హోటల్‌లో నారాయణ (50) పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం హోటల్ వెనుక పడి ఉన్న రేకుల షెడ్డు వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న విద్యుత్ తీగలు తగిలి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.హోటల్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ సరికొత్త ప్రయాణం

స్టార్ లైనర్ స్లీపర్ బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆర్టీసీ తెనాలి డిపోలో నూతనంగా తెనాలి–హైదరాబాద్‌కు ప్రవేశపెట్టిన రెండు స్టార్ లైనర్ స్లీపర్ బస్సులను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన స్లీపర్ బస్సులు హైదరాబాద్ వెళ్లే ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉండగలవన్నారు. ముందుగా ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎమ్మెల్యే శివకుమార్‌కు స్వాగతం పలికారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్లీపర్ బస్సులను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

అంతర్జాతీయ సదస్సులో ప్రాతినిధ్యం వర్సిటీకి గర్వకారణం

- వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- బెస్ట్ డిప్లమాట్స్ సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు అభినందన

ఏఎన్‌యూ: ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఏఎన్‌యూ అధ్యాపకులు పాల్గొని అధ్యయన పత్రాలు సమర్పించడం అభినందనీయమని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ 'బెస్ట్ డిప్లమాట్స్' సంస్థ ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు దుబాయ్‌లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. ఇందులో పత్రాలు సమర్పించిన ఏఎన్‌యూ అధ్యాపకులు ఆచార్య కె. మధుబాబు, ఆచార్య సరస్వతిరాజు అయ్యర్‌లను శుక్రవారం యూనివర్సిటీ ఉన్నతాధికారులు అభినందించారు. వీసీ మాట్లాడుతూ సదస్సులో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యతల్ని సంతరించుకున్న అంశాలపై ఏఎన్‌యూ అధ్యాపకులు అధ్యయన పత్రాలు సమర్పించడం ప్రయోజనకరమన్నారు. ఆచార్య మధుబాబు 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇంపాక్ట్ ఆన్ ఇండస్ట్రియల్ సెక్టార్ ఇన్ అండర్ డెవలపింగ్ కంట్రీస్' అనే అంశంపై, ఆచార్య సరస్వతి రాజు ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆన్ ఇండస్ట్రీస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ వియత్నామ్' అనే అంశంపైన సమర్పించిన పత్రాలు విధాన నిర్ణయాల రూపకల్పనకు దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ అధ్యాపకులంద రూ అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని విలువైన అంశాలు సమర్పించాలని వీసీ సూచించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరాజు ఉన్నారు.



అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ

శివాలయానికి వాటర్ కూలర్ బహూకరణ

పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన తూటుపల్లి నాగేశ్వరరావు, సరస్వతి దంపతులు వారి కుమారుడు ఈశ్వర వెంకట శ్రీనివాసశాస్త్రి జ్ఞాపకార్థం వాటర్ కూలర్‌ను ఆలయానికి అందజేశారు. దాతల సమక్షంలో పూజలు చేసి కూలర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ప్రత్యేక బస, ఏర్పాట్లు భేష్

పెదకాకాని: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బస, ఏర్పాట్లు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. ఇక్బాల్ అహమ్మద్ తెలిపారు. హజ్ యాత్రికుల కోసం మండలంలోని నంబూరు సిరాజుల్ ఉలూమ్ మదర్సాలో ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తొలిసారిగా హాజీలు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పవిత్ర మక్కా , మదీనా నగరాలకు నేరుగా విమానాల్లో వెళ్తున్నారని తెలిపారు. టికెట్ ధరలో వ్యత్యాసం గురించి డెప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బి.ఎస్. గౌసల్ అజాం , ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగానే ఒక్కో హాజీ ఖాతాలో రూ. 80 వేలు జమ చేయడం అభినందనీయమని తెలిపారు. జిల్లా వక్ఫ్ కమిటీ సభ్యుడు సయ్యద్ సుభాని పాల్గొన్నారు.







సభా ప్రాంగణం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) , ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

ముఖ్యమంత్రికి నేతల స్వాగతం

తాడేపల్లిరూరల్: తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం అదే ప్రాంగణంలో సీఎంకు ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.

పోషకాహారంతోనే బిడ్డకు ఆరోగ్యం

ఫిరంగిపురం: గర్భిణులు తగిన పోషకాహారం తీసుకోవడం ద్వారానే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఫిరంగిపురం సెక్టారు వైద్యురాలు తాలికొండ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. సాధారణ రోగాలకు, బీపీ, షుగర్ ఉన్న 45మందికి వైద్య పరీక్షలు, రక్తపరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాలలో విద్యార్థులకు సాధారణ పరీక్షలు, పోషకాహారం అందుతున్న వివరాలు, ఐరన్ మాత్రలు వేస్తున్న పద్ధతులను తెలుసుకున్నారు. శారీరకంగా వారి ఎదుగుదల, బరువు, ఎత్తులు పరిశీలించారు. ఆరోగ్యశ్రీపై ఆపరేషన్లు చేయించుకున్న వారిని పరీక్షించారు. వైద్య పరీక్షల కోసం రాలేని గర్భిణులు, బాలింతల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి పరీక్షలు చేసి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం తీసుకోవడం ద్వారా చేకూరే మేలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం అంతోనిరాణి, ఆశ కార్యకర్తలు సుజాత, శాంతరాణి, శాంతకుమారి, పద్మ, జోజమ్మలు పాల్గొన్నారు.



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు టి.ఎస్తేరురాణి

వార్షిక శిక్షణకు కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లు

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ 25వ బెటాలియన్ బి ఎన్‌సీసీ నిర్వహించే వార్షిక శిక్షణ శిబిరానికి కేఎల్ విశ్వవిద్యాలయానికి చెందిన 20 మంది క్యాడెట్లు వెళ్లినట్లు శుక్రవారం హాబీ క్లబ్ ఇన్‌చార్జి సుభాకర్‌రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లకు వార్షిక శిక్షణ శిబిరం క్యాంపును నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 26 నుంచి జూన్ 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నారని, ఈ శిక్షణ శిబిరంలో క్యాడెట్లకు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, డ్రిల్ లపై ప్రత్యేక శిక్షణతోపాటు వివిధ అంశాలపై ప్రాక్టికల్, థియరీ పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలపైన శిక్షణ ఇస్తారని అన్నారు. జట్టు కృషిని, నాయకత్వం, ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి చేసుకోవడం, సామాజిక సేవా కార్యకలాపాల పట్ల అవగాహన కల్పించడం, సేవలు, పౌర జీవితంలో ఉపయోగపడే శిక్షణ గురించి క్యాడెట్లకు వివరిస్తారని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారులు డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఎన్‌సీసీ సమన్వయకర్త జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక శిక్షణకు వెళుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

పెరుకలపూడిలో కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు

ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెరుకలపూడి ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతూ కొన్ని రోజుల కిందట ఎమ్మెల్యే ఆర్కేకు వాట్సప్ మెసేజ్ ద్వారా విషయాన్ని తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి శుక్రవారం పెరుకలపూడి ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి, వీధిలైట్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేయించారు. ఎస్సీ కాలనీకి చెందిన వారు సమస్యను తెలిపిన వెంటనే స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.



పెరుకలపూడి ఎస్సీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

హైకోర్టు న్యాయవాది రవికుమార్‌కు అభినందన

తెనాలి: దుబాయ్‌లో ఈ నెల 19–22 తేదీల్లో జరిగిన 'బెస్ట్ డిప్లొమాట్స్' అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొని వచ్చిన పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మేకల రవికుమార్‌ను శుక్రవారం ఆయన స్వస్థలంలో సత్కరించారు. కృత్రిమ మేధ అంశంపై జరిగిన సదస్సుకు 65 దేశాల్నుంచి 175 మంది ప్రతినిధులు పాల్గొనగా, భారతదేశం నుంచి హాజరైన అయిదుగురిలో మేకల రవికుమార్ ఒకరు. పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ నేతృత్వంలో స్థానిక కొణిజేటి రోశయ్య మార్గ్‌లోని ప్రైవేటు కార్యాలయంలో రవికుమార్‌ను శుక్రవారం సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించగలరన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. తనకు జరిగిన సత్కారానికి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు కొణిజేటి గోపీకృష్ణ, పెనుగొండ వెంకటేశ్వర్లు, ఎన్వీ బ్రహ్మం, కొల్లా గురునాథ గుప్త, ఆలపాటి శివ తదితరులు పాల్గొన్నారు.



మేకల రవికుమార్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య నేతలు

డివైడర్‌ను ఢీకొట్టిన స్కూటీ

ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులకు గాయాలు

ప్రత్తిపాడు: స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు సచివాలయ మహిళా పోలీసులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు-1 సచివాలయం మహిళా పోలీస్ రజిని, గనికపూడి సచివాలయ మహిళా పోలీస్ భార్గవి శుక్రవారం అమరావతి రాజధానిలో జరిగిన సీఎం కార్యక్రమానికి బందోబస్తుకు వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ప్రత్తిపాడుకు స్కూటీపై వస్తున్నారు. మార్గంమధ్యలో ఏటుకూరు సమీపంలో గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో రజిని, భార్గవికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా పోలీసులను పరామర్శించారు. చికిత్స నిమిత్తం వారికి పదివేల రూపాయలను అందించారు.